క్లుప్తంగా

బస్ షెల్టర్ ఏర్పాటు చేయాలి

బంట్వారం: మండల పరిధిలోని సల్బత్తాపూర్ గేటు వద్ద బస్ షెల్టర్ ఏర్పాటుచేయించాలని గ్రామస్తులు శనివారం తెలిపారు. వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు వర్షా కాలం తీవ్ర ఇబ్బందులకు గురికావల్సి వస్తుందన్నారు. అలాగే మంచి నీటి వసతి కోసం హ్యాండ్ బోరు కూడా వేయించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి వెంటనే బస్ షెల్టర్ ఏర్పాటు చేయించాలని కోరారు.

బోరు వేయించండి



ఎంపీడీఓ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న హెచ్ఎం వినోద్‌కుమార్

తాండూరు రూరల్: కొత్లాపూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో బోరు వేయించాలని ప్రధానోపాధ్యాయుడు జొన్నల వినోద్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. బోరు లేకపోవడంతో పాఠశాలలో నీటి కొరత ఏర్పడిందన్నారు. నీళ్లు లేకపోవడంతో మధ్యాహ్న భోజనం తయారు చేయడం కష్టంగా మారిందన్నారు. విద్యార్థులు టాయిలెట్లకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కావున అధికారులు స్పందించి బోరు వేయించాలని కోరారు.

పనిచేసే కార్యకర్తలకే గుర్తింపు

కాంగ్రెస్ ఎస్టీ సెల్ నాయకుడు విఠల్ నాయక్

కుల్కచర్ల: కాంగ్రెస్‌లో పనిచేసే కార్యకర్తలకు, పార్టీ కోసం కృషి చేసిన నాయకులను గుర్తించి నామినేటెడ్ పదవులు ఇవ్వాలని ఎస్టీ సెల్ నాయకులు విఠల్ నాయక్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..సొంత వ్యాపారం నిర్వహించుకుంటూ అప్పుడప్పుడు వచ్చి పోయే నాయకులకు కాకుండా పార్టీ కోసం శ్రమించే వారికే పదవులు ఇవ్వాలని కోరారు. కొంతమంది అప్పుడే వచ్చి హడావుడి చేస్తారని, డబ్బులు ఉన్న వాళ్లు ఆర్భాటం చేసి తమ గొప్పలను చాటుకుంటారని జిల్లా నాయకుల దృష్టికి తెచ్చారు. పై అంశాలను గ్రహించి పార్టీకోసం, ప్రజల మధ్య ఉండి వారికోసం పనిచేసే నాయకులకే పదవులు కట్టబెట్టాలన్నారు.

పీర్లకు చాదర్ సమర్పణ



పీర్లకు చాదర్ సమర్పిస్తున్న గురునాథ్‌రెడ్డి

కొడంగల్: పట్టణంలోని బీబీ పాతిమా, అలీ అబ్బాస్, ఇమామ్ ఖాసీమ్ పీర్లకు రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి శనివారం పూలచాదర్, దట్టి సమర్పించారు. పీర్ల దగ్గర ప్రార్థన నిర్వహించారు. పీర్ల చావిడి నిర్వాహకులు గురునాథ్‌రెడ్డికి సాదారంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎమ్ గౌసస్, వాహీద్, అబ్దుల్ సత్తార్, రహమత్ ఖాన్, సయ్యద్ మునీర్, మిఠాయి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్ఎస్‌యూ ఆవిర్భావ వేడుకలు



జెండా ఆవిష్కరిస్తున్న భీమరాజు

కొడంగల్ రూరల్: రెవల్యూషనరీ విద్యార్థిసంఘం (ఆర్ఎస్‌యూ) ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు భీమరాజు జెండా ఆవిష్కరణ చేసి మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో విద్య, వైద్యం, ఉపాధి లక్ష్యంగా ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి సంఘం నిత్యం పనిచేస్తుందన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కల్పనకు అలుపెరుగని పోరాటం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు మోహన్, మహేశ్, వెంకటేశ్, శ్రీలత, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

తాండూరు రూరల్: బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11:30 నిమిషాలకు పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహిస్తారని తెలిపారు. కావున ఆయా గ్రామాల్లోని కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు.

అంతా డిజిటలైజేషన్!

- పెరుగుతున్న ఆన్‌లైన్ సేవలు
- గ్రామాల్లో సైతం క్యాష్‌లెస్ పేమెంట్లు
- మోసాలకు చెక్



కిరాణదుకాణంలో క్యూ ఆర్ స్కానర్

దౌల్తాబాద్: రోజు రోజుకు పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో సమాజంలో ఎక్కడ చూసినా క్యాష్‌లెస్ డిజిటల్ చెల్లింపులే జరుగుతున్నాయి. పట్టణాల్లోనే కాదు గ్రామాల్లో కూడా ఈ సేవలే నిర్వహిస్తున్నారు. అంతేకాదు తండాల్లో కూడా క్యాష్‌లెస్ పేమెంట్లు కొనసాగుతున్నాయి. గ్రామాల్లోని చిన్న, చిన్న దుకాణాల్లో వ్యాపారులు స్కానర్లు ఏర్పాటు చేస్తున్నారు. వాటి ద్వారా చెల్లింపులు సులువవుతున్నాయని చెబుతున్నారు. చిరు వ్యాపారుల నుంచి షాపింగ్ మాల్ వరకు అంతా డిజిటల్ చెల్లింపులనే ప్రోత్సహిస్తున్నారు. జేబులో రూపాయి లేకపోయినా బాధలేదు. జేబుల్లో, పర్సుల్లో డబ్బులు తీసుకెళ్లే అవసరం తగ్గింది. ఒక్క ఫోన్ ఉంటే సరిపోతుంది. స్మార్ట్‌ఫోన్ ఖాతాలో డబ్బులు ఉంటే చాలు. కావాల్సినవి కొనుగోలు చేసుకోవచ్చు. నగదు ఎవరికైనా పంపించాలన్నా, తీసుకోవాలన్నా అంతా రెప్పపాటులో అయిపోతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే డిజిటల్ పేమెంట్ లేని వ్యాపారమే లేదంటే అతిశయోక్తి కాదు.

2016 నుంచే..

కేంద్ర ప్రభుత్వం 2016లో చేపట్టిన పెద్దనోట్ల రద్దు అనంతరం ఆర్థిక లావాదేవీల్లో ఇబ్బందులను అధిగమించేందుకు డిజిటల్ పేమెంట్లను తీసుకొచ్చారు. కాని అప్పట్లో అవి పెద్ద వ్యాపార సంస్థలకు మాత్రమే పరిమితమయ్యాయి. నగదు వేరే వారి ఖాతాల్లోకి బదలాయించబడుతుందేమోనని అపోహ, భయం ఎక్కువగా ఉండేది. ఆర్థిక మోసాలు కూడా ఈ కోవలోనే ఉంటాయనేది ప్రాచుర్యంలో ఉండేది. దీంతో వాటి నిర్వహణ గ్రామాల్లో వీటి జాడ పెద్దగా కనిపించలేదు. క్రమేణ 2019 తర్వాత నగదు రహిత లావాదేవీలకే ఎక్కువగా మొగ్గు చూపారు. వాటి నిర్వహణలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. దీంతో చిల్లర సమస్యకు అడ్డుకట్ట పడింది.

మోసాలను అదుపు చేయొచ్చు

ఆన్‌లైన్ చెల్లింపుల్లో ఉపయోగాలతో పాటు నష్టాలు సంభవించే అవకాశం కూడా ఉంది. ఆదమరిస్తే మోసానికి గురయ్యే సందర్భాలు లేకపోలేదు. వాటిపై అవగాహన లేని వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని కొందరు మాయగాళ్లు మోసాలకు పాల్పడుతుంటారు. వస్తువులను కొనుగోలు చేసిన తరువాత వేరే వారికి డబ్బులు బదిలీ చేస్తారు. సెల్‌ఫోన్ స్క్రీన్‌పై వచ్చిన బదిలీని సక్సెస్‌ఫుల్ మెసేజ్‌ను దుకాణదారులకే అమౌంట్ పే చేసినట్లు చూపించి అక్కడి నుంచి జారుకుంటారు. అయితే మార్కెట్‌లోకి వచ్చిన క్యూ ఆర్ కోడ్‌తో చెల్లింపు జరిగిందా? లేదా? అనే విషయం తెలుసుకోవచ్చు. చెల్లింపు జరిగిన వెంటనే ఎంత మొత్తం దుకాణదారు ఖాతాకు జమ అయ్యిందనే విషయం వాయిస్ రూపంలో వినిపిస్తుంది. దీంతో డిజిటల్ మోసాలకు అడ్డుకట్ట పడుతుందని వ్యాపారులు చెబుతున్నారు. ఏది ఏమైనప్పటికీ డిజిటల్ సేవలను ఎక్కువగా వినియోగించడం శుభ పరిణామం.



విద్యుత్ సబ్‌స్టేషన్

వానాకాలం జరభద్రం

- విద్యుత్ ప్రమాదాలకు దూరంగా ఉండండి
- సొంతంగా మరమ్మతులు చేయొద్దు
- నిర్లక్ష్యం చేస్తే అంతే సంగతులు

దౌల్తాబాద్: వర్షాకాలం జాగ్రత్తగా ఉంటే విద్యుత్ ప్రమాదాలనుంచి బయటపడొచ్చు. గాలివానకు స్తంభాలు పడిపోయి తీగలు తెగిపడి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. రైతులు, వినియోగదారులు కొద్దిపాటి జాగ్రత్త పాటించి వాటి బారి నుంచి తప్పించుకోవచ్చని విద్యుత్ శాఖ అధికారులు సూచిస్తున్నారు. లేదంటే ప్రాణాలకే ప్రమాదం ఏర్పడుతుందని చెబుతున్నారు. వర్షంతో పాటు గాలి వీచే సమయంలో మెళకువగా ఉండాలి. విద్యుత్ స్తంభాలు ఉన్న చోట వ్యవసాయ పనులు చేయొద్దు. తీగలు, కిందపడినా, వేలాడుతూ కనిపించినా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం చేరవేయ్యాలి.

మోటార్లు బిగించే క్రమంలో..

పంటలు సాగు చేసే ప్రతి రైతు మోటార్లను అమర్చే క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ల వద్దే మరమ్మతులు చేస్తుంటారు. దీంతో అవి కాలిపోయే అవకాశం ఉంటుంది. కావున రైతులు సొంతంగా మరమ్మతులు చేయొద్దని అధికారులు సూచిస్తున్నారు.

> **అధికారులను సంప్రదించాలి**
>
> రైతులు వర్షాకాలంలో సొంతంగా మరమ్మతులు చేయకుండా విద్యుత్ అధికారులను, సిబ్బందిని సంప్రదించాలి. లేదంటే ప్రమాదం చోటు చేసుకునే అవకాశం ఉంటుంది. రైతులు చిన్నపాటి పొరపాటు చేసి ప్రాణాలు కొని తెచ్చుకోవద్దు.
>
> – మహిపాల్, ఏఈ, దౌల్తాబాద్

మొక్కలు అందుబాటులో ఉంచాలి

మండల ప్రత్యేకాధికారి వెంకట్‌నారాయణ



నర్సరీని పరిశీలిస్తున్న వెంకట్‌నారాయణ, తదితరులు

కేశంపేట: వనమహోత్సవంలో నాటేందుకు అవసరమైన మొక్కలను అందుబాటులో ఉంచాలని మండల ప్రత్యేక అధికారి, మెప్మా పీడీ వెంకట్‌నారాయణ అన్నారు. మండల పరిధిలోని చౌలపల్లిలో నర్సరీని, నిర్మాణంలో ఉన్న ఇళ్లను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సరీల్లో ప్రజలకు అవసరమైన మొక్కలు అందుబాటులో ఉంచాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లను నాణ్యతతో నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ప్రభుత్వం సూచించిన మేరకు ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య, ఏపీఓ అజీజ్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్, మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం



న్యూసిటీ కాలనీలో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల్లో సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం సుమారు రూ.22కోట్లతో వివిధ కాలనీల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. త్వరలో వంద కోట్లతో పట్టణంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు వెల్లడించారు. గత పాలకులు పట్టణాల అభివృద్ధిపై నిర్లక్ష్యంగా వ్యవహరించారని, మాస్టర్ ప్లాన్ రూపొందించలేదని విమర్శించారు. ఫలితంగా చాలా కాలనీల్లో అభివృద్ధి పనులు కనిపించడం లేదన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిలో ప్రజలందరూ పార్టీలకతీతంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తద్వారా పట్టణాలు అన్ని రంగాల్లో త్వరితగతిన అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమాల్లో కమిషనర్ సునీత, నాయకులు బాబర్‌ఖాన్, రఘునాయక్, విశ్వం, కొంకళ్ల చెన్నయ్య, విజయ్‌కుమార్‌రెడ్డి, బసిరెడ్డి నరేందర్‌రెడ్డి, శ్రావణి, జమ్మద్‌ఖాన్, అప్పి, ఇబ్రహీం, ఖాదీర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆషాఢ శుద్ధ ఏకాదశి పూజలు



మాట్లాడుతున్న హీరాలాల్

కొడంగల్ రూరల్: చాతుర్మాస ఆషాఢ శుద్ధ ఏకాదశి పూజలు ఆదివారం నిర్వహించనున్నట్లు ఆధ్యాత్మిక ధార్మిక సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ హీరాలాల్ తెలిపారు. శనివారం పట్టణంలోని సంపూర్ణ ఆయుర్వేదిక్ క్లినిక్‌లో సత్సంగ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చాతుర్మాస పూజల వివరాలను తెలిపారు. సత్సంగ సభ్యుల నివాసంలో చాతుర్మాస పూజలు నిర్వహించనున్నట్లు భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. జులై 6నుంచి నవంబర్ 1వ తేదీ వరకు 4నెలల పాటు ప్రతీ గురువారం రాత్రి 8.30గంటల నుంచి 11గంటల వరకు సత్సంగ(భజన) కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు.

పంటల రక్షణకు చర్యలు

పొలాల్లో దిష్టిబొమ్మలు ఏర్పాటు చేస్తున్న రైతులు



సోమ్లనాయక్ తండాలో పొలంలో ఏర్పాటు చేసిన దిష్టిబొమ్మ

దుద్యాల్: పంటలను పశువుల నుంచి, దొంగల నుంచి రక్షించుకోవడానికి రైతులు తమతమ పొలాల్లో మనిషిని పోలిన దిష్టిబొమ్మ ఏర్పాటు చేస్తున్నారు. కొంత మంది రైతులు సోలార్ విద్యుత్, మరి కొంత మంది గట్లపై కర్రలు పాతి చీరలు చుడుతున్నారు. అందులో భాగంగానే మండల పరిధిలోని సోమ్లు నాయక్ తండాకు చెందిన ఓ గిరిజన రైతు మిరప, టమాట పంటను కాపాడుకోవడానికి దిష్టిబొమ్మ తయారు చేసి పొలం మధ్యలో ఉంచాడు. రాత్రి వేళల్లో వచ్చే అడవి పందులు, దొంగలు ఈ బొమ్మను చూసి మనుషులు ఉన్నారనే భ్రమలో పంటను నష్టం చేయవని వారు చెబుతున్నారు.

ఆలయ రాజగోపురం నిర్మాణానికి విరాళం

షాద్‌నగర్: పట్టణంలోని లక్ష్మీనర్సింహకాలనీలో ఉన్న శివమారుతీ గీతా అయ్యప్ప మందిరం రాజగోపురం నిర్మాణానికి పట్టణానికి చెందిన మద్దెల జ్యోతి, కుమారస్వామి దంపతులు శనివారం రూ.5లక్షలు, నంద్యాల అనిత, పుల్లారెడ్డి దంపతులు రూ.11,116 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు విరాళానికి సంబంధించిన చెక్కులను వారు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు లష్కర్ ఆంజనేయులు, రెటికల్ నందీశ్వర్, దాస కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న దాతలు

దేవాలయంలోనే గ్రామ పంచాయతీ!

- ఎక్కచెరువు తండాలో పరిస్థితి
- భవనం మంజూరు చేయాలని వేడుకోలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న భక్తులు
- పట్టించుకోని అధికారులు



ఆలయంలో కొనసాగుతున్న కార్యాలయం

దుద్యాల్: ఓ గ్రామంలో గ్రామ పంచాయతీ భవనం అందుబాటులో లేకుంటే పాఠశాలలోని ఓ గదిలో, అంగన్‌వాడీ భవనంలో నిర్వహించడం చూశాం. కానీ దేవాలయంలో గ్రామ పంచాయతీ భవనం ఏర్పాటు చేసి కార్యకలాపాలను ఎక్కచెరువు తండాలో నిర్వహిస్తున్నారు. తండాలో గ్రామ పంచాయతీ భవనం లేకపోవడంతో కార్యకలపాలు సాగించేందుకు ఇబ్బందిగా మారడంతో చేసేదేమి లేక తండాలో నిర్మించుకున్న దేవాలయంలోనే ఒక గది ఏర్పాటు చేశారు. అక్కడే గ్రామానికి సంబంధించిన కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఆలయంలో కార్యకలాపాలు నిర్వహించడం భక్తులకు ఇబ్బందిగా ఉందని వాపోతున్నారు.ఈ విషయాన్ని పట్టించుకునే వారు కరువయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తండాకు గ్రామ పంచాయతీ భవనం మంజూరు చేయాలని కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం

ఎంపీడీఓ కరీం



మాదారంలో మొక్కలు నాటుతున్న ఎంపీడీఓ కరీం తదితరులు

పరిగి: ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ కరీం పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని పోల్కంపల్లి, పేటమాదారం, మాదారం గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో పంచాయతీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు మురుగు కాల్వల శుభ్రం, పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో ఎక్కడైన నీరు నిల్వ ఉంటే వాటిని తొలగించాలని, పిచ్చిమొక్కల తొలగింపును నిత్యం చేపట్టాలన్నారు. గ్రామానికి కేటాయించిన మొక్కలను నాటి లక్ష్యం పూర్తి చేయాలని తెలిపారు. గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయితీ కార్యదర్శులు వెంకట్‌రెడ్డి, కవిత, దానమ్మ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ఏఎంసీ డైరెక్టర్ నర్సింహులు గౌడ్



పగిడియాలలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

యాలాల: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తాండూరు ఏఎంసీ డైరెక్టర్ ఈడ్గి నర్సింహులు గౌడ్ పేర్కొన్నారు. శనివారం పగిడియాల గ్రామంలో లబ్ధిదారులకు మంజూరైన ఇళ్లకు ముగ్గుపోసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చొరవతో పేదలకు ఇళ్లు మంజూరు చేస్తున్నామన్నారు. మొదటి దశలో ఇళ్లు రాని వారికి రెండో విడతలో అందజేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గోపాల్, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, గ్రామస్తులు రఘురాంరెడ్డి, సంపత్‌కుమార్, మల్లప్ప, చంద్రయ్య, నర్సింహులు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



వీడ్కోలు కార్యక్రమంలో అతిథులు

ప్రిన్సిపాల్ సాయిసత్యనారాయణరెడ్డి

మొయినాబాద్: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సాయిసత్యనారాయణరెడ్డి సూచించారు. మున్సిపాలిటీ పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న అరిస్టాటిల్ పీజీ కళాశాల ఎంబీఏ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం శనివారం పద్మావతి గార్డెన్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కష్టపడి చదివి ఉన్నత రంగాల్లో స్థిరపడాలని సూచించారు. సమాజం పట్ల అవగాహన పెంచుకొని బాధ్యతగా నడుచుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో అరిస్టాటిల్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, కేజీరెడ్డి కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నర్సయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక చట్టం తీసుకురావాలని వినతి

దివ్యాంగుల జాతీయ హక్కుల సంఘం చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షుడు యాదయ్య



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దివ్యాంగులు

శంకర్‌పల్లి: స్థానిక సంస్థల్లో దివ్యాంగులకు ప్రాతినిధ్యం ఉండేలా ప్రభుత్వం ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని దివ్యాంగుల జాతీయ హక్కుల సంఘం చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షుడు కాసాల యాదయ్య డిమాండ్ చేశారు. దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ బాలకృష్ణారెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 43 లక్షల మంది దివ్యాంగులు ఉండగా.. వారిలో 24.85లక్షల మంది చేయూత పెన్షన్స్ కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. అదేవిధంగా దివ్యాంగుల కార్పొరేషన్‌ను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం ఆలోచనలు చేయాలని కోరారు. తమిళనాడు, రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లో దివ్యాంగులకు స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం ఉండేలా ప్రత్యేక చట్టం తీసుకొచ్చారన్నారు. అదేవిధంగా తెలంగాణలోనూ అదే రకమైన చట్టం తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో దివ్యాంగుల జాతీయ హక్కుల సంఘం మండల అధ్యక్షుడు బిర్ల పెద్దకుమార్, నాయకులు ఎస్.కుమార్, దత్తు, శ్రీనివాస్, శీతల్‌సింగ్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాల పెంపకంలో జాగ్రత్తలు అవసరం

మండల పశువైద్యాధికారి శిరీష

చేవెళ్ల: మూగజీవాల పెంపకంలో పాడి రైతులు సరైన జాగ్రత్తలు తీసుకోవటంతో పాటు అవగాహన కలిగి ఉండాలని మండల పశువైద్యాధికారులు శిరీష, దేవేందర్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పలుగుట్ట వార్డులో, మండలంలోని ఆలూరు గ్రామాల్లో శనివారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జూనోసెస్ డే సందర్భంగా జూనోటిక్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ సంవత్సరం జూలై 6వ తేదీన ప్రపంచ జూనోసెస్ డేగా నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ప్రజలు, రైతులకు ఈ వ్యాధులపై అవగాహన కల్పించి అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. ఇవి అంటువ్యాధులనీ, వైరస్, బ్యాక్టీరియా, పరాన్నజీవుల నుంచి వ్యాపిస్తాయన్నారు. జంతువుల నుంచి మనుషులకు ఈ వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ వ్యాధులు జంతువులలో ప్రత్యక్షంగా లేదా పరోక్ష తాకిడి, వెక్టర్-బోర్న్ లేదా ఆహారం ద్వారా వ్యాప్తి చెందుతాయన్నారు. మూగజీవాలను పెంచే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాడి రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. దీంతో పాటు రేబీస్ వ్యాధిపై అవగాహన కల్పించారు. పెంపుడు కుక్కలు, పిల్లులకు అంటీరేబీస్ వ్యాక్సిన్ వేయించాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, ప్రజలు, ఉపాధ్యాయులు, వెటర్నరీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.